క్లుప్తంగా

వైభవంగా దేవాలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో నూతన దేవాలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం సాయంత్రంతో ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన దేవాలయాలు కోదండ రామస్వామి, లక్ష్మీనరసింహ స్వామి, బొడ్రాయి, జీవధ్వజ విగ్రహాలు ప్రతిష్ఠా మహోత్సవాలు ఆగమ సిద్ధాంతి శ్రీపతి అనంతాచార్యులు, జనార్ధనచార్యులు, అశోక్ కుమార్‌ల సారథ్యంలో ఉదయం 8.12 నిముషాలకు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయనతో పాటు సర్పంచ్ పురేటి నాగేశ్వరావు, గడుపూడి నాగేశ్వరరావు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, కార్యదర్శి చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెంలో....

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ రూరల్ మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి, శ్రీ హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి వారి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే బొల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

3న ముండ్రువారిపాలెంలో ప్రతిష్ఠ

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో నూతనంగా శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత స్వామి శిలా విగ్రహాలు దేవాలయం జీవధ్వజ స్తంభం, బొడ్రాయి (నాభి శిల) ఈనెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠా వేడుకలు ఆగమ సిద్ధాంతి దివి జ్యోతిర్మయి కుప్పయ్య సారథ్యంలో వేదపండితులు వేదమంత్రాల నడుమ వైభవంగా జరుగుతాయని గ్రామస్తులు బుధవారం తెలిపారు.

3న ప్రజావేదిక

నాదెండ్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఈ నెల 3న మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ చెప్పారు. 2022-23కి గాను సుమారు రూ.6 కోట్ల వరకూ పనులు జరిగాయి. దీనిపై గత కొద్ది రోజులుగా సీఆర్‌పీ, డీఆర్‌పీలు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికకు జిల్లా పీడీ జోసఫ్ కుమార్, ఎస్‌ఆర్‌పీ బుజ్జి హాజరుకానున్నట్లు తెలిపారు.

సాతులూరులో వాహనం చోరీ

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు డివిఆర్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తన ఇంటి ఎదుట కారు షెడ్డులో ఏపీ07డీఈ 4377 నంబరు గల నలుపు రంగు రాయల్ ఎన్‌ఫీల్డ్ - బుల్లెట్టు వాహనం నిలిపాడు. బుధవారం ఉదయం ఇంటి బయటకు రాగా, షెడ్డులో ఉంచిన బుల్లెట్టు కనిపించలేదు. దీంతో నాదెండ్ల పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పనులన్నింటికీ రికార్డులు తయారు చేయాలి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సమీక్షాసమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో, పీవో టి.పార్వతి మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను ఉద్యాన పంటల సాగులో 100 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు జరిగేలా చూడాలని, ప్రతిరోజూ 8వేల మంది కూలీలకు పని కల్పించే లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్. ఆంజనేయరాజు, సాంకేతిక, క్షేత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధైర్యసాహసాలకు ప్రతీక సూపర్‌స్టార్ కృష్ణ

జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, అభిమానులు

నరసరావుపేట: తెలుగు సినీ చిత్రరంగంలో సూపర్‌స్టార్ కృష్ణ ధైర్యసాహసాలకు ప్రతీకని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బుధవారం కృష్ణ 81వ జయంతిని పురస్కరించుకుని స్థానిక తొమ్మిదవ వార్డు శ్రీనివాస నగర్‌లోని కేఆర్ వృద్ధాశ్రమంలో టౌన్ వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్‌చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హీరో కృష్ణ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. పరిశ్రమకు మొట్టమొదటి సినీమాస్కోపు, కలర్ చిత్రాలను పరిచయం చేశారన్నారు. ఉమ్మడి ఏపీలో తెలుగు సినీ పరిశ్రమ నిలదొక్కునేందుకు తనవంతు కృషి చేశారన్నారు. ఆయన లోటు సినీరంగానికి తీర్చలేనిదన్నారు. ఆయన కుమారుడు మహేష్‌బాబు మంచి నటుడిలా రాణిస్తూ ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందారన్నారు. పట్టణ అధ్యక్షుడు ఫారూఖ్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో హీరో కృష్ణ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో అభిమానులు నిమ్మిశెట్టి శంకర్, షేక్.నబిబాజీ, లింగంగుంట్ల రాములు, ఎ.తిరుపతయ్య, షేక్.మస్తాన్‌షరీఫ్, బి.కొండలరావు, టింట్ కరిముల్లాభాయ్, కుక్కలపోలు, థామస్, పి.వెంకటరావు. వైఎస్సార్‌సీపీ నాయకులు సింధుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినుకొండలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సూపర్‌స్టార్, నటశేఖర్ సినీహీరో కృష్ణ జయంతి వేడుకలను కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మార్కెట్ నన్నేసా, చిట్టిబాబు, రంగారెడ్డి, శివకుమార్, వెంకటరవీంద్ర, మల్లెల పూర్ణ, డీకే అచారి, సురేష్‌బాబు, నేపాల్, రత్నం, శేఖర్, సోమసూత్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రతినిధులు

చిలకలూరిపేట: పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరి గుడిసెలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ గుడిసెల్లో నివాసం ఉంటున్న పేరుపోగు మరియమ్మ, మరో మతిస్థిమితం లేని మహిళ కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం అందుకున్న ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు ప్రతినిధులు, ఇరువురు బాధితులకు బుధవారం రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు షేక్ సుభాని, జి.వెంకట్, షేక్ బాష తదితరులు పాల్గొన్నారు. మదర్‌థెరిస్సా కాలనీలో నివాసం ఉండే నన్నపనేని వెంకట్ శస్త్ర చికిత్స నిమిత్తం ఫౌండేషన్ తరుపున రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు.

గోగులపాడులో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసి ఉన్న కమలాంబికా దేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళేశ్వరస్వామి పరివారదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రమౌళేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీపీ జయశ్రీ వెంట్రామిరెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మంగాపురనాథ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో పలుగ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇటీవల కాలంలో గ్రామాలల్లో అకాలవర్షాలకు విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యలను తెలిపారు. అలాగే కొన్ని గ్రామాలల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా అందటం లేదని సభ దృష్టికి తెచ్చారు. వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీపీ సభలో హామీ ఇచ్చారు. చిన్నచిన్న సమస్యలు మినహా సభ సజావుగా సాగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయలక్ష్మి, తోపాటు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో ఆరంభమైన ప్రతిష్ఠా కార్యక్రమం



గణపవరం నూతన రామాలయంలో పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో భారీ వ్యయంతో నిర్మించిన శ్రీ రామాలయంలో ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుధవారం గణపవరం గీతాసమాజం వారిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, రాత్రికి రామనామ సంకీర్తన, శ్రీ లలితా నామ పారాయణం చేశారు. 7 గంటలకు బొప్పూడి వారిచే భజనా కార్యక్రమం జరిగింది. ఈ నెల 3వ తేది నుండి కెల్లంపల్లి వీరయ్య ధర్మసత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో హోమ కార్యక్రమాలు జరగనున్నాయి. టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో హోమం జరగనుంది. జూన్ 7న ఉదయం 7.43 గంటలకు సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కలశ, జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది. ముఖ్యఅతిథిగా త్రిదండి చినజీయర్ స్వామి హాజరుకానున్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

- డాక్టర్ గ్రంధి శ్రీనివాసరావు
- వేర్వేరు ప్రాంతాల్లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న డాక్టర్ గ్రంధి శ్రీనివాసరావు



రొంపిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

చిలకలూరిపేట టౌన్: పొగాకు, దాని ఉత్పత్తులు సేవించటం ద్వారా భయంకరమైన నోటి క్యాన్సర్ వస్తోందని డాక్టర్ గ్రంధి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జ్ఞానేశ్వరి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుపాటి బుల్లిబాబు, జెర్రిపోతుల బుల్లిబాబు, గోపతోటి రవి, దార్ల బుజ్జిబాబు, గ్రంధాలయ ఇన్‌చార్జి అధికారి నాగుల్ మీరావలి పాల్గొన్నారు.

40 శాతం మందికి క్యాన్సర్

నాదెండ్ల: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో 40 శాతం మంది ప్రాణాంతక క్యాన్సర్‌కు గురౌతున్నారని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్ ప్రసాద్‌నాయక్ చెప్పారు. పీహెచ్‌సీలో బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ షేక్ అజీజ్, పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పొగాకును నిషేధించండి

రొంపిచర్ల: ధూమపానానికి దూరంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన రొంపిచర్లలో వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పొగతాగడం వల్ల క్యాన్సర్ లాంటి మహమ్మారి వ్యాధిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెల్లి చిన కోటిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది సురేష్, రాము, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...



శావల్యాపురం సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న వైద్యాధికారులు

శావల్యాపురం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నీ గ్రామ సచివాలయాల్లోని పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం బుధవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యాధికారులు సయ్యద్ ఇబ్రహీం, వేముల వెంకట భాస్కర్ ప్రసంగించారు. ఈసదస్సులో సూపర్‌వైజరు సాయిగీతా, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి కాలనీవాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



వెల్లటూరు అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు

బొల్లాపల్లి: బాల్యవివాహాల వలన పలు అనర్థాలు సంభవిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి తెలిపారు. మండలంలోని బొల్లాపల్లి, గుమ్మనంపాడు, వెల్లటూరు అంగన్‌వాడీ సెక్టార్ల పరిధిలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు బాల్య వివాహాలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వెల్లటూరు సెక్టార్‌లో సూపర్‌వైజర్ ఆర్ పద్మాజారాణి, గుమ్మనంపాడు సెక్టార్‌లో షేక్ మస్తాన్‌బీలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. చిన్నవయసులో వివాహాలు చేసుకోవడం వలన జరిగే నష్టాల గురించి వివరించారు. వివాహ వయసు 18, 21 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. చిన్నవయసులో వివాహాల వలన గర్భం దాల్చడంతో పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. మాతృమరణాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కలిగించాలని తెలిపారు. బడిమానేసిన ఆడపిల్లలను గుర్తించి గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి విద్యపై శ్రద్ధ కలిగేలా చేసి పాఠశాలల్లో చేర్పించాలని కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పిలుపునిచ్చారు. శిక్షణలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: యుక్తవయస్సు రాకముందే బాలికలకు వివాహాలు జరపటంతో శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ చెప్పారు. మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ మహిళా సంరక్షణ కార్యకర్తలకు బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం బాలికా విద్య కోసం ఎన్నో మెరుగైన వసతులు కల్పించిందని, తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. చక్కగా చదువుకున్న బాలికలకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నందున ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తోడ్పడాలన్నారు. చదువుకునే వయస్సులో వివాహం జరపటం వారి హక్కులను కాలరాయడమేనన్నారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాల నిరోధానికి అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, రమేష్, టీజేకే రాజేశ్వరి, షేక్ అఖిల పాల్గొన్నారు.

ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

నరసరావుపేట: కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జాతీయ ఓబీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఎ.వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీవోహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో 52 శాతం జనాభా కలిగిన ఓబీసీల మౌలిక అభివృద్ధి, సంక్షేమం పట్ల కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దేశంలో జంతువులకు సైతం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉందని, కానీ అత్యధిక జనాభా కల్గిన ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఓబీసీ విద్యార్థులకు వర్తింపజేయాలన్నారు. అలాగే ఓబీసీ కుల జనగణను చేపట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బీవీఎస్ సాగర్, బత్తుల వెంకటేష్, కటారి శివరామకృష్ణ, బొందిలి శ్రీనివాస్ సింగ్, రావూరి వెంకట కోటేశ్వర రావు, సయ్యద్ పెద్దకాజా పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయని గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0-5 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు కల్గిన చిన్నారులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటలవరకు పుస్తక పఠనం, కథలు చెప్పటం, రాయటం, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, ఉపన్యాసం అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 11వ తేదీన ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాససింగ్ చిన్నారులు పాల్గొన్నారు.